క్లుప్తంగా

పోర్టు కనెక్టివిటీ రహదారి పనుల పరిశీలన



చిలకలపూడి(మచిలీపట్నం): బందరు పోర్టు నిర్మాణానికి సంబంధించి రోడ్డు, రైలు కనెక్టివిటీ పనులను బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) బుధవారం పరిశీలించారు. మండల పరిధిలోని మేకవానిపాలెం, కరగ్రహారం మీదుగా నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను మేఘా ఇంజినీరింగ్ కంపెనీ ప్రతినిధులతో కలిసి పరిశీలించి తగు సూచనలు చేశారు. సర్పంచ్ మేకా లవకుమార్ (నాని), వైఎస్సార్ సీపీ నాయకులు కోసూరి మునలయ్య, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

326 మందికి వైద్య పరీక్షలు

మచిలీపట్నంటౌన్: విజయవాడలోని ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం జరిగిన శిబిరాన్ని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ వీవీ ఫణిరామ్‌కుమార్ ప్రారంభించారు. 326 మంది ఎస్‌బీఐ ఉద్యోగులకు, ప్రజలకు డాక్టర్లు రవితేజ, వంశీకృష్ణ, సందీప్, నాగేశ్వరరావు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆస్పత్రి గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత్‌శర్మ మాట్లాడుతూ ఎంజే నాయుడు ఆస్పత్రికి సకాలంలో వచ్చిన వారికి 50 శాతం రాయితీతో వైద్య సేవలు అందిస్తామని వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బంటుమిల్లి: పెందుర్రు గ్రామానికి చెందిన బాడిత నాగబాబు(40) బుధవారం గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగబాబు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 4వ తేదీన పొలం వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స కోసం 108 వాహనంలో బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎ. పైడిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ముగిసిన నరసింహస్వామి కల్యాణోత్సవాలు


గూడూరు: గూడూరులో కొలువుదీరిన రాజ్యలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన బుధవారం స్వామి వారికి పుష్పయాగోత్సవం ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయానికి చేరుకున్న అద్దంకి నాంచారమ్మ



పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. 15 రోజులుగా గ్రామంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఇంటింటా దర్శనమిచ్చింది. చివరిరోజున గుడి సంబరం నిర్వహించి అమ్మవారిని ఆలయ ప్రవేశం చేశారు. ఆలయ అర్చకులు సంప్రదాయ పద్ధతితో పూజలు నిర్వహించారు. ఆలయ పాలకవర్గ కమిటీ చైర్మన్ ఆకుల వెంకట్రామయ్య, కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్ నేతృత్వంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆనందోత్సాహాలతో హోలీ



కృత్తివెన్ను: హోలీ పండుగ బుధవారం ఘనంగా జరిగింది. చిన్నారులు రంగులు జల్లుకుంటూ సందడి చేశారు. హోలీ పౌర్ణమి సందర్భంగా చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ సంతోషంగా పండుగ జరుపుకున్నారు. సెలవు దినం కావడంతో చిన్నారులు వీధుల్లో గుంపులుగా తిరుగుతూ, పంటకాలువల్లోని నీటిలో సందడిగా రంగులు జల్లుకున్నారు.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఘనంగా మహిళా దినోత్సవం





అవనిగడ్డలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహిళలను సత్కరించిన ఎమ్మెల్యే సింహాద్రి : పెడనలో మహిళలను సన్మానిస్తున్న జోగి రాజీవ్ : కృత్తివెన్ను జెడ్పీటీసీ రత్నకుమారిని సన్మానిస్తున్న వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు





చల్లపల్లిలో మహిళలను సత్కరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ పాగోలు ఫణి : బంటుమిల్లి ఎంఎస్ కార్యాలయంలో సత్కారాలను అందుకున్న డ్వాక్రా సభ్యులు : లేడీయాంప్తిల్ కళాశాలలో మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య

అవనిగడ్డ: మహిళాభ్యున్నతి ప్రాధాన్యత ఇస్తూ వారు ఆర్థిక స్వావలంబన సాధించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, అవనిగడ్డ సర్పంచ్ గౌరుముచ్చు ఉమాతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులను ఎమ్మెల్యే సింహాద్రి, ఆయన సతీమణి కెప్టెన్ లక్ష్మీ ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పలు పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. మహిళల అభ్యున్నతికి సీఎం ఎన్నో పథకాలు తీసుకొచ్చారని చెప్పారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక దిశ చట్టం తీసుకురావడంతో పాటు మహిళలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దిడ్ల కిరణ్, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, పలువురు మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత న్యాయ సహాయం

మచిలీపట్నంటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మచిలీపట్నం నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక లేడీయాంప్తిల్ జూనియర్ కళాశాల, కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ మహిళలందరికీ ఉచితంగా న్యాయ సహాయం అందించేందుకు తమ సంస్థ పనిచేస్తోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐనంపూడి ఆనందకుమార్, మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ. పద్మ మాట్లాడారు. కళాశాల అధ్యాపకులను, జయప్రదను సన్మానించారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో...

వాసవీక్లబ్, వాసవీ వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు డి–విటమిన్ లోపం పరీక్షలు నిర్వహించారు. వాసవీ వనిత క్లబ్ ప్రతినిధులు శ్రీకాకోళపు రేణుకారాణి, వేముల శిరీష, అశోక్, సురేష్, దివ్యశ్రీ, అనూరాధ, సునీత పర్యవేక్షించారు. ఐసీఈయూ మచిలీపట్నంశాఖ ఆధ్వర్యంలో అత్యధిక ఎల్‌ఐసీ పాలసీలు చేసిన మహిళా ఏజెంట్లను సన్మానించారు. ప్రభుత్వ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. గాంధీనగర్‌లోని ఉదయపు నడకల మిత్ర మండలి భవనంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ డెవలప్మెంట్ ఆఫీసర్ ఝాన్సీలక్ష్మీ, ఘంటసాల మహాలక్ష్మీ, రామిశెట్టి రాజకుమారి, సునంద నర్మద, చిలకలపూడి హైస్కూల్ హెచ్‌ఎం కనకదుర్గలను సన్మానించారు. యోగాసాధకులు ర్యాలీ నిర్వహించారు. చిలకలపూడి అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో గాయత్రి హైస్కూల్ ప్రిన్సిపాల్ లతా నాంచారయ్యను ఆశ్రమ నిర్వాహకురాలు కరెడ్ల సుశీల సత్కరించారు. సహకార ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌సీఎం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అవసరమైన ఆరు మెడికేటెడ్ బెడ్లు అందజేశారు. సహకార సీనియర్ ఇన్‌స్పెక్టర్ పవన్‌చక్రవర్తి వేంద్ర వరలక్ష్మీని సన్మానించారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక హెడ్ పోస్టాఫీస్ సెంటర్ వద్ద నుంచి కోనేరు సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు.

- **పెడన:** మండల సమాఖ్య కార్యాలయంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఎంపీపీ రాజులపాటి వాణి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, డీపీఎం పి. కనకారావు, ఏపీఎం శ్రీదేవి, పెడన మండల సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.
- **అవనిగడ్డ:** స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి విద్యా సంస్థ ఆవరణలో విద్యా సంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు తల్లిదండ్రులు లక్ష్మీకాంతమ్మ–వీరరాఘవయ్య, కళాశాల అధ్యక్షురాలు వసుమతి, మహిళా అధ్యాపకులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.
- **కృత్తివెన్ను:** స్థానిక స్త్రీశక్తి భవనంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, డ్వాక్రా సిబ్బంది, అధికారులు కృత్తివెన్ను జెడ్పీటీసీ సభ్యురాలు మైల రత్నకుమారిని సన్మానించారు.

ఆమె మాట్లాడుతూ మహిళల అభ్యున్నతితోనే దేశాభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక ఎంపీటీసీ కూనసాని మహాలక్ష్మీ, ఎంఎస్ ప్రెసిడెంట్ అరుణకుమారి, సీసీలు వసంతకుమారి, విజయలక్ష్మీలను అధికారులు, సిబ్బంది సత్కరించారు.

- **బంటుమిల్లి:** మండల సమాఖ్య కార్యాలయంలో పలువురు డ్వాక్రా మహిళా సభ్యులను ఘనంగా సత్కరించారు. ఏపీఎం డి. శ్రీను పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఎన్. గౌరీరూప, మండల సమాఖ్య కార్యదర్శి జి. లిల్లీకుమారి, బీఓ అధ్యక్షురాళ్లు గంగాభవాని, జ్యోతి తదితరులను మహిళా సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.
- **చల్లపల్లి:** స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కేడీసీసీ బ్యాంక్ బీఎం యలవర్తి నగరాజకుమారి, ఇండియన్ బ్యాంక్ ఏబీఎం పావనిలను సమాఖ్య అధ్యక్షురాలు తెనాలి ఇందిర, ఏపీఎం సీహెచ్‌వీవీ బాపనయ్య ఘనంగా సన్మానించారు. సీపీఎం కార్యాలయంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులను సన్మానించారు. చల్లపల్లి పీఏసీఎస్‌లో కేడీసీసీ బ్యాంక్ బీఎం నగరాజకుమారి, అసిస్టెంట్ మేనేజర్ ఎస్.శిరీష, ఉద్యోగినులు, పీఏసీఎస్ మహిళా సిబ్బందిని చైర్‌పర్సన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి) సన్మానించారు. ఆప్కాబ్ రాష్ట్ర శాఖలో బీఎం మునిపల్లి అశోక్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వక్కలగడ్డ సర్పంచ్ వల్లూరు ఉమా, మహిళా నాయకురాలు బొందలపాటి లక్ష్మి విచ్చేసి ఆప్కాబ్ సేవలను ప్రశంసించారు.

ఏపీలో మహిళలకు అగ్రతాంబూలం

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అగ్రతాంబూలం అందించారని, ఇందుకు నిదర్శనం మహిళలకు 50 శాతం రిజర్వేషన్లను కల్పించడంతోపాటు ఎక్కువగా మహిళలకు పదవులు కట్టబెట్టారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బ్రహ్మపురంలోని దేవాంగ కల్యాణ మండపంలో వివిధ రంగాల్లో రాణించిన మహిళలను ఘనంగా సన్మానించారు. క్రీడాపోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ మహిళా ప్రజాప్రతినిధులు, నాయకురాళ్లు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, వైస్ చైర్మన్ బైలపాటి జ్యోతి, ఎంపీపీ రాజులపాటి వాణి, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, కటకం నాగకుమారి, కృత్తివెన్ను జెడ్పీటీసీ మైలా రత్నకుమారి, వన్నం శ్రీలత, ఝాన్సీరాణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా జగన్ పాలన

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): రాష్ట్రంలో పారదర్శకంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. పెదకళ్లేపల్లి గ్రామ సచివాలయం ఒకటిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీకి చెందిన తలపుల విజయలక్ష్మీ ఎమ్మెల్యే సింహాద్రి చేతులు పట్టుకుని ప్రభుత్వ పాలన చాలా బాగుందని, మరొకసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుస్తారని దీవించింది. స్థానిక రోడ్లపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరింది. సీఎం నుంచి ఫోన్ అందుకున్న వృద్ధ మహిళ కూరేటి విశాలాక్షి ఫోన్‌లో మాట్లాడుతూ మాలాంటి వారికి పింఛన్లు అందించి కాపాడుతున్నారని ఆనందం వ్యక్తంచేసింది. అనంతరం ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో 90కి పైగా పంచాయతీలు ఉండగా 46 పంచాయతీలలో మహిళలను సర్పంచ్‌లు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ డ్వాక్రా సంఘాలలో 80 వేల మందిని ప్రోత్సహించారని, వారికి ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకుగాను ప్రభుత్వం చిరు వ్యాపారులకు అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి గెలిపించాలని కోరారు. దివి ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ కన్వీనర్ గండు దుర్గారావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ అరజా లక్ష్మీతులసి, కొండేటి రమేష్, అరజా నరేంద్రకుమార్, తైలం బ్రహ్మారాజు, అరజా చలపతిరావు, తోట కృష్ణాంజనేయులు, రెడ్రౌతు రాంప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.



వృద్ధురాలు అందుకుంటున్న పింఛన్ చదివి వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

ఎమ్మెల్యే పేర్ని నానికి ముస్లింల కృతజ్ఞతలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని జామియా మసీదు అభివృద్ధి పనులకు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)కి ముస్లింలు, వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వారు సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా మాట్లాడుతూ జామియా మసీదు అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చాలని మసీదు కమిటీ పెద్దలు ఎమ్మెల్యే పేర్ని నానిని కోరారని, ప్రభుత్వ పరంగా నిధుల మంజూరుకు సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారు. దీంతో పేర్ని నాని రూ. 10 లక్షల నగదును ఆయన తనయుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) చేతుల మీదుగా మసీదు కమిటీ పెద్దలకు మంగళవారం అందజేశారని చెప్పారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా మాట్లాడారు. ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మోపిదేవి: మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి 2023–24 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదలైందని మోపిదేవి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె. వీర రవి తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు.

ప్రవేశం కావలసినవారు ఈనెల 5 నుంచి ఏప్రిల్ 4వ తేదీ మధ్య ఆన్‌లైన్‌లో రూ. 100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు మీకు దగ్గరలోని మహాత్మా జ్యోతిబా పూలే సంక్షేమ గురుకుల విద్యాలయంలో ప్రధానాచార్యులను సంప్రదించాలని కోరారు.

ఘనంగా గురుకుల పాఠశాల వార్షికోత్సవం

మోపిదేవి మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం రాత్రి పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వీర రవి తొలుత పాఠశాల నివేదిక చదివి వినిపించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అనంతరం క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా అతిథులు అవనిగడ్డ హెడ్ పోస్ట్‌మాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు, సర్వశిక్షా అభియాన్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎ. రాంబాబు, విజ్ఞాన్ విహార్ విద్యాసంస్థల అధినేత కె. సూర్య తేజ, పీఎంసీ చైర్మన్ నాయుడు డేవిడ్ మాట్లాడారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్టేడియం క్రీడాకారులకు పతకాల పంట

గుడివాడటౌన్: తమ క్రీడాకారులు ఏ పోటీలకు వెళ్లినా బంగారు పతకాలు సాధించడం గొప్ప విషయమని ఎన్టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి పాలేటి వెంకట శివ సుబ్రహ్మణ్యేశ్వరరావు (చంటి), పర్వతనేని ఆనంద్ అన్నారు. స్టేడియం కార్యాలయంలో వివిధ పోటీల్లో విజయాలు సాధించిన క్రీడాకారులను బుధవారం సత్కరించారు. ఈనెల 5వ తేదీ ఎన్టీఆర్ జిల్లా జగయ్యపేట అబ్దుల్‌కలాం ఇండోర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తమ క్రీడాకారులు 4 బంగారు పతకాలు, వెండి పతకం సాధించారన్నారు. 47 కిలోల విభాగంలో ఎన్.వీరనాగఅను 187 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం, 52 కిలోల విభాగంలో కె.జోత్స్న వెండి పతకం, 63 కిలోల విభాగంలో పి.గోపిక, 67 కిలోల విభాగంలో వి.స్ఫూర్తి, 84 కిలోల విభాగంలో జి.సుభాషిణి బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు.



వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు

కరాటే పోటీల్లో..

కృష్ణా జిల్లా వేమవరం గ్రామంలో గతనెల 19న జరిగిన ఆల్‌ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు 2023లో తమ క్రీడాకారులు 13 మంది పాల్గొని 9 మంది వివిధ కేటగిరిలలో మెడల్స్ సాధించారన్నారు. జిమ్ కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావు, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ జె ఉషాకుమారి, కరాటే కోచ్ సీహెచ్ శ్రీనివాసరావు, మేనేజర్ ఎం .సత్యన్నారాయణ పాల్గొన్నారు.

కరకట్టపై లారీ, పాల వ్యాన్ ఢీ

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



పురిటిగడ్డ (చల్లపల్లి): చల్లపల్లి మండలం పురిటిగడ్డ శివారు నిమ్మగడ్డ వద్ద కృష్ణానది కరకట్టపై బుధవారం తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం జరిగింది. విజయవాడ నుంచి వస్తున్న పాలవ్యాను–అవనిగడ్డ నుంచి వెళుతున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. రెండు వాహనాల ముందు భాగాలు ధ్వంసమయ్యాయి. పాల వ్యాన్ డ్రైవర్ అనిల్ కాళ్లు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాయి. ట్రాక్టర్ సాయంతో రెండు వాహనాలు వేరు చేసి క్షతగాత్రుడు అనిల్‌ను 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అన్నాభిషేకం

పామర్రు: స్థానిక అంకమ్మతల్లి ఆలయంలోని శ్రీ రేణుకా పరమేశ్వరస్వామివారికి ఘనంగా అన్నాభిషేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్వామికి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. తదుపరి సహస్ర నామాలతో విశేషంగా పూజల అనంతరం అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కోటి పాండురంగారావు, అధ్యక్షుడు వరదా అప్పారావు, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

తోట్లవల్లూరు: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని రైతు సాధికార సంస్థ ప్రాజెక్టు రిసోర్స్‌పర్సన్ వందవాసు అచ్చిమాంబ సూచించారు. స్థానిక కమ్యూనిటీ మేనేజ్ ప్రకృతి వ్యవసాయంపై బుధవారం సాయంత్రం ఆమె రైతులకు అవగాహన కల్పించారు. వేసవిలో 32 రకాల విత్తనాలను మాగాణిలో వేయటం ద్వారా కూరగాయలు, పశువుల మేత లభిస్తాయని అచ్చిమాంబ చెప్పారు. మిగిలిన పైరును కలియదున్ని నాటు వేసినట్లయితే వరిపైరు ఏపుగా ఎదుగుతుందన్నారు. భూమిలో బలం పెరగటంతోపాటు మంచి దిగుబడులు రావటానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఐసీఆర్‌పీలు ఫాతిమున్నీసా, కల్యాణి, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీల పక్షపాతి సీఎం జగన్

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనారిటీల పక్షపాతిగా పేరొందారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. సీఎం జగన్ ఆదేశాలతో ఇటీవల వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన షేక్ సలార్‌దాదా, పార్టీ కృష్ణా జిల్లా గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ కరార్ మూసవి, యువజన విభాగం నగర అధ్యక్షునిగా నియమితులైన షేక్ జలీల్‌లను పేర్ని కిట్టు బుధవారం పూల మాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అచ్చేబా, 33వ డివిజన్ కార్పొరేటర్ మీర్ అస్గర్‌అలీ, వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ మహమ్మద్ సాహెబ్, మహమ్మద్ రఫీ, బాషు, షేక్ రబ్బానీ, యూనస్ తదితరులు పాల్గొన్నారు.



సలార్‌దాదా, జలీల్, కరార్‌లను సన్మానిస్తున్న కిట్టు

కౌలు రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం

జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్

మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లాలో ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన కౌలు రైతుల కుటుంబాలకు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తారని ఆ పార్టీ నాయకుడు నాదెండ్ల మనోహర్ తెలిపారు. బుధవారం రాత్రి కార్యకర్తల సమావేశంలో మనోహర్ మాట్లాడారు. ఈ నెల 14వ తేదీన గూడూరు వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పొలాల్లో నిర్వహించనున్న బహిరంగ సభలో రైతు కుటుంబాలకు ఈ మొత్తాలను అందిస్తారని చెప్పారు. జిల్లాలో 51 మంది కౌలు రైతులు ఆత్మహత్య చేసుకుని మృతి చెందారని ఆర్‌టీఐ, జిల్లా ఎస్పీ ద్వారా తమకు సమాచారం వచ్చిందని, ప్రస్తుతం పార్టీ ఆధ్వర్యంలో సర్వే చేస్తున్నామన్నారు. పోలీసులు సూచించిన విధంగా సభ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆ పార్టీ బందరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండ్రెడ్డి రామకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మనోహర్

చెన్నకేశవ స్వామి కల్యాణం

పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల మండలం తాడంకి గ్రామంలోని శ్రీభూ సమేత చెన్నకేశవ స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీటీసీ యేనుగ వెంకట రమణకుమారి, యేనుగ మస్తాన్‌రావుల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు కల్యాణ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక రాము దంపతులు పూజలు చేశారు. ఆలయ అర్చకులు రామాచార్యులు, ఆర్‌ఎల్‌ఆర్ ప్రసాద్ కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. అనంతరం సుమారు 2 వేల మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, భక్తులు స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

ముదినేపల్లి రూరల్ : మండలంలోని సింగరాయపాలెం శ్రీలక్ష్మీనృశింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి అర్చకుల ఆధ్వర్యంలో చైర్మన్ మీగడ నెలబాలుడు, ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు.